క్లుప్తంగా

ఐద్వా ధర్నాకు సీపీఎం మద్దతు

ప్రొద్దుటూరు : స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద ఈ నెల 21న ఐద్వా ఆధ్వర్యంలో చేపట్టనున్న ధర్నాకు సీపీఎం మద్దతు ఇస్తున్నట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఆయన తమ కార్యాలయంలో మాట్లాడుతూ పద్మావతి కొడుకులు కోట్ల రూపాయల ఆస్తులను పంచుకుని తల్లిని పట్టించుకోవడం లేదన్నారు. తనకు న్యాయం చేయాలని ఆమె ఎస్పీకి స్పందనలో ఫిర్యాదు చేశారన్నారు. ఎస్పీ ఈ విషయంపై స్థానిక వన్‌టౌన్‌కు రెఫర్ చేశారని తెలిపారు. ఎస్ఐ మంజునాథ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లితే మీరే మాట్లాడుకోండని నేనేమి చేయలేనని చెప్పారని తెలిపారు. దీనిపై ఐద్వా ఆధ్వర్యంలో ఈనెల 21న వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద నిర్వహించే ధర్నాలో సీపీఎం, ఎస్ఎఫ్ఐ పాల్గొంటాయని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం



పరీక్షిస్తున్న డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక లక్ష్య కార్డియాక్, కంటి ఆస్పత్రిలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ పాతకోట శ్రీనాథ్‌రెడ్డి, డాక్టర్ హరిత పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి 45 మంది రోగులకు ఉచితంగా పరీక్షలు చేశారు. వారిలో 26 మందికి ఈసీజీ, 10 మందికి గుండె స్కానింగ్ పరీక్షలు చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డాక్టర్ హరిత 32 మందికి కంటి పరీక్షలు చేసి చికిత్సలు అందించారు.

తొండలదిన్నెలో అన్న, వస్త్రదానం



రాజుపాలెం: తొండలదిన్నె మఠం వద్ద అన్నదానం చేస్తున్న దృశ్యం

రాజుపాలెం : మహా శివరాత్రి పండుగను పురస్కరించుకొని మండలంలోని తొండలదిన్నె గ్రామంలోని మఠం వద్ద ఆదివారం కొంతమంది గ్రామస్తులకు వస్త్ర, అన్నదానం చేశారు. ప్రముఖ వైద్యులు వద్ది సూర్యప్రకాశ్ గ్రామంలోని కొంతమంది మహిళలకు చీరలు, వృద్ధులకు పంచలు, టవాళ్లను పంపిణీ చేశారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



నరసాపురంలో ఛత్రపతి జయంతి వేడుకలను నిర్వహిస్తున్న గ్రామస్తులు

కాశినాయన : మండలంలోని నరసాపురం గ్రామంలో మరాఠీ వంశస్తులు ఛత్రపతి శివాజీ 393వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పురవీధుల గుండా ఛత్రపతి చిత్రపటాన్ని ఊరేగించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

రేపు ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం

బద్వేలు అర్బన్ : రామకృష్ణ పరమహంస జయంతిని పురస్కరించుకుని మంగళవారం రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం నిర్వహించనున్నట్లు రామకృష్ణ సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు అంకయ్య, అమరేంద్రనాథ్‌రెడ్డిలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక తెలుగుగంగ కాలనీ రోడ్డులోని సాయిబాబా గుడి వెనుకభాగంలోని రామకృష్ణ సేవా సమితి ఆశ్రమ ప్రాంగణంలో సాయంత్రం 5:30 గంటల నుంచి నిర్వహించే ఈ కార్యక్రమానికి అచలానంద ఆశ్రమ నిర్వాహకులు విరజానందస్వామి ప్రవచనకర్తగా వ్యవహరిస్తారని వారు తెలిపారు. ఆధ్యాత్మిక జిజ్ఞాసులు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

వైభవంగా ఎండు మిరపకాయల మహాయజ్ఞం

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని పెద్దనపాడు గ్రామంలో వెలసిన మదనగోపాలస్వామి దేవాలయంలో నారాయణీ ప్రత్యంగిరా మహాదేవి దివ్య విశ్వశాంతి ఆశీస్సులతో ఎండు మిరపకాయల మహాయజ్ఞం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి యర్రగుంట్ల మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి హాజరయ్యారు. 108 కలశాలతో హోమ ప్రవేశం చేశారు. ఈ మహాయజ్ఞం వలన సకల సంపదలు కలుగుతాయని వారు తెలిపారు.

పాహిమాం.. వీరబ్రహ్మేంద్రస్వామి





మోహినీ అలంకారంలో దర్శనమిస్తున్న వీరబ్రహ్మేంద్రస్వామి, ఈశ్వరీదేవిమఠంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న మఠాధిపతులు వీరశివకుమారస్వామి

బ్రహ్మంగారిమఠం : 'పాహిమాం.. వీరబ్రహ్మేంద్రస్వామి' అంటూ భక్తులు శరణు వేడారు. మహాశివరాత్రి సందర్భంగా స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున మఠానికి తరలివచ్చారు. బ్రహ్మంగారి కల్యాణోత్సవాలు మూడు రోజుల నుంచి వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం మోహినీ అలంకారోత్సవంలో దర్శనమిచ్చారు. భక్తులు దర్శించుకుని భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. ఉదయం ప్రత్యేక పూజలనంతరం స్వామివారు మోహినీ అలంకారంలో పుర వీధుల్లో విహరించారు. మధ్యాహ్నం నామ సంకీర్తన, భజన (పారాయణ) కార్యక్రమాలు చేపట్టారు. రాత్రి నంది ఉత్సవం ఉత్సాహంగా సాగింది. పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరబోగ వసంత వెంకటేశ్వర స్వాముల కుమారులు శ్రీ వెంకటాద్రిస్వామి, వీరభద్రస్వామి, వీరంభట్లయ్యస్వామి, దత్తాత్రేయస్వామి, గోవిందస్వామి, వరదరాజులస్వామి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవదాయశాఖ వారు, మఠం నిర్వాహకులు ఏర్పాట్లు చేపట్టారు. బి.మఠం దేవస్థానం ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ, మేనేజర్ ఈశ్వరాచారి, ఉభయదాతలు నెల్లూరు జిల్లా నార్తురాజుపాళెంకు చెందిన బద్వేలి రమణారెడ్డి, దేవమ్మ, మద్రాసుకు చెందిన కన్నయప్పన్, కందిమల్లాయపల్లె పుర ప్రజలు పాల్గొన్నారు. బి.మఠం ఎస్ఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

ఈశ్వరీదేవి మఠంలో..

ఈశ్వరీదేవిమఠంలో మహాశివరాత్రి సందర్భంగా శ్రీపార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవాలు మూడు రోజుల నుంచి ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం అభిషేకం, కుంకుమార్చన, ఆవాహిత సర్వదేవతా షోడశోపచార పూజ, రుద్రహోమం, పూర్ణాహుతి, దేవతోద్వాసనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పోరుమామిళ్ల భగవాన్ రమణమహర్షి భక్త బృందం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసింది. రాత్రి పార్వతీపరమేశ్వరుల కల్యాణమూర్తుల గ్రామోత్సవం నిర్వహించారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు చెప్పిన హరికథా కాలక్షేపం భక్తులను అలరించింది. అనంతరం ఈశ్వరీదేవి సింహావాహన సేవను నిర్వహించారు. మఠాధిపతులు శ్రీ వీరశివకుమారస్వాముల ఆధ్వర్యంలో ఈఓ బీవీ జగన్‌మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో కార్యక్రమాలు చేపట్టారు. ఉభయ దాతలు సుంకు సురేష్‌బాబు, వరలక్ష్మి, నాగజశ్వంత్, శశాంక్, నెల్లూరుకు చెందిన వొమ్మెన పెద్ద ఈశ్వరయ్య, శోభాదేవి, మురళీకృష్ణ, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



కొండపైన మల్లెంకొండేశ్వరస్వామి గ్రామోత్సవం

గోపవరం : మండలంలోని మల్లెంకొండేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం అర్ధరాత్రి బద్వేలు మున్సిపల్ చైర్మన్ ఆర్.వి.సాయికృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన శివపార్వతుల కల్యాణం ఘనంగా సాగింది. అనంతరం కొండపైన స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో మహా ఘట్టం శివపార్వతుల కల్యాణం. ఈ కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భక్తులకు దేవాదాయశాఖ, పాలక మండలి సభ్యులు మెరుగైన సౌకర్యాలు కల్పించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ అధికారులు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు. బద్వేలు రూరల్ పోలీసులు కొండపైన భక్తులకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించారు.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం



వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని కొండావధూత ఆశ్రమం, గోవిందయ్య మఠం ఆవరణలోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి జన్మ నక్షత్రమైన శ్రవణనక్షత్రం సందర్భంగా ఆదివారం ఆలయ ఆవరణలో కల్యాణం కమనీయంగా సాగింది. ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాదిరెడ్డి వెంకటరామిరెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు రమేష్‌శర్మ, సత్యనారాయణశర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు కరువు భత్యం ప్రకటించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం కరువు భత్యం ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల కోరారు. ఆదివారం శ్రీవెంకటేశ్వర డిగ్రీ కాలేజీలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కేంద్ర ఉద్యోగులకు మూడు డీఏలు ప్రకటించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక్క డీఏ కూడా ప్రకటించలేదని తెలిపారు. 2018 నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రావాల్సిన డీఏలను ఇంత వరకు చెల్లించలేదని తెలిపారు. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఒంటేరు శ్రీనివాసులరెడ్డికి విజయానికి ఏపీటీఎఫ్ సభ్యులు కృషి చేయాలని కోరారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లా భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగరాజు, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు కృష్ణారెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు రామదస్తగిరిరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు గోపినాథ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, గురయ్య, ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఈఈఎంటీ ప్రతిభా పరీక్షలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు



పసల వీర ఉదయశ్రీ

మైదుకూరు : ఉపకార వేతనాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఈఈఎంటీ (ఎడ్యుకేషన్ ఎపిఫని మెరిట్ టెస్ట్) ప్రతిభా పరీక్షలో మైదుకూరు మున్సిపాలిటీలోని కేశలింగాయపల్లెకు చెందిన విద్యార్థిని పసల వీర ఉదయశ్రీ రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించింది. ప్రభుత్వ పాఠశాలల్లో 7, 10 తరగతులు చదివే విద్యార్థుల కోసం ప్రభుత్వం ఈ పరీక్ష నిర్వహిస్తుంది. ఏడవ తరగతి చదివే వారు ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే 10వ తరగతి వరకు ఏడాదికి రూ.20వేలు ఉపకార వేతనం పొందుతారు. మున్సిపాలిటీలోని శెట్టివారిపల్లె హైస్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న వీర ఉదయశ్రీ తల్లిదండ్రులు సరిత, వీరభద్రుడు విద్యాధికులైనా వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థిని ఈఈఎంటీ పరీక్షలో ప్రతిభ చాటి రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించడం పట్ల పాఠశాల హెడ్‌మాస్టర్ బండి సత్యనారాయణ, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

అల్లాడుపల్లెలో బండలాగుడు పోటీలు



జనసందోహం నడుమ జరుగుతున్న పోటీలు



నగదు బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

ప్రథమ బహుమతి సాధించిన ప్రొద్దుటూరు ఎద్దులు

చాపాడు : అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి సన్నిధిలో మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని ఆదివారం మధ్యాహ్నం రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రొద్దుటూరు మండలం చౌటపల్లెకు చెందిన మార్తల చంద్ర ఓబుళరెడ్డి ఎద్దులు 1808.01 అడుగులు బండను లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా పీఆర్ పల్లెకు చెందిన నాగయ్య ఎద్దులు 1680 అడుగులు లాగి ద్వితీయ స్థానం, నందలూరుకు చెందిన హబీబుల్లా ఎద్దులు 1465.08 అడుగులు లాగి తృతీయ స్థానం, వీరపునాయునిపల్లె మండలం కీర్తిపల్లెకు చెందిన చిట్టిబోయిన భరత్ కుమార్ ఎద్దులు నాలుగో స్థానం, సింహాద్రిపురం మండలం చెర్లోపల్లెకు చెందిన నంద్యాల శివరామిరెడ్డి ఎద్దులు ఐదోస్థానం, ప్రొద్దుటూరు మండలం ఖాదర్‌బాద్ సిద్దారెడ్డి నాగసుబ్బారెడ్డి ఎద్దులు ఆరో స్థానం, దొరసానిపల్లెకు ఎద్దులు ఏడో స్థానాలల్లో నిలిచాయి. గెలుపొందిన ఎద్దుల యజమానులకు పలువురు ఔత్సాహికులు విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి, ఈఓ శ్రీనివాసులు, మాజీ సింగిల్ విండో చైర్మన్ వేమారెడ్డి, గ్రామ సర్పంచ్ కిశోర్‌కుమార్‌రెడ్డి, ఓబుళరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరువులో జలకళ.. పొలాల్లో పైరు కళకళ



రెడ్డిపల్లి చెరువులో పుష్కలంగా ఉన్న నీరు



చెరువుకింద ఆయకట్టు భూముల్లో పచ్చగా దర్శన మిస్తున్న వరిపైరు

అట్లూరు : ఎన్నో ఏళ్లగా నీరులేక బీళ్లుగా మారిన రెడ్డిపల్లి చెరువుకింద ఆయకట్టు పొలాలు నేడు పచ్చని వరిపైరుతో కళకళ లాడుతున్నాయి. మండల పరిధిలోని రెడ్డిపల్లి చెరువుకింద ఆయకట్టు పొలాలు కడప–బద్వేలు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్నాయి. అయితే గత ప్రభుత్వంలో ఏనాడు చెరువుకింద ఆయకట్టు పైరుకు నోచుకోలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో చెరువుకింద ఆయకట్టు భూములు వరిపైరుతో కళకళ లాడుతున్నాయి. ప్రస్తుతం ఎండాకాలం వచ్చినా చెరువులో నీరు పుష్కలంగా ఉన్నాయి.

ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రటరీగా నాయబ్‌రసూల్



నాయబ్‌రసూల్‌కు సత్కరిస్తున్న దృశ్యం

పోరుమామిళ్ల : పోరుమామిళ్లకు చెందిన తైక్వాండో మాస్టర్ నాయబ్‌రసూల్ ఒలంపిక్ అసోసియేషన్ కడప జిల్లా జాయింట్ సెక్రటరీగా ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నాయబ్ తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా ఉంటూ ఇప్పుడు ఒలంపిక్ అసోసియేషన్ కడప జిల్లా జాయింట్ సెక్రటరీగా ఎన్నికవడంతో క్రీడాకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జై భవానీ.. జయహో శివాజీ!

– ఘనంగా మరాఠీల శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న నగర మేయర్ సురేష్‌బాబు

కడప కల్చరల్ : కడప మరాఠిమండలి మహారాష్ట్ర మఠం కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో భారీ శోభాయాత్ర నిర్వహించారు. మరాఠా యోధుడు శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని స్థానిక అంబా భవానీ ఆలయం నుంచి ర్యాలీ ప్రారంభమైంది. తొలుత ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి ర్యాలీ నిర్వహించారు. ఆలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ మాసీమ సర్కిల్, వన్‌టౌన్, ఏడురోడ్ల కూడలి, పాత బస్టాండు, రవీంద్రనగర్ మీదుగా తిరిగి ర్యాలీ ఆలయం వద్దకు చేరుకుంది. నగర మేయర్ సురేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మాసీమబాబు, ఏపీ పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు సభ్యుడు పాకా సురేష్, కార్పొరేటర్ బాలస్వామిరెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొని అందరినీ ఉత్సాహ పరుస్తూ సాగారు. శివాజీ చిత్రాలుగల కండువాలు, పేటాలు, టోపీలు, పతాకాలు ధరించిన మరాఠాలు దారి పొడవునా ర్యాలీలో జై భవాని, జయహో శివాజీ, శివాజీ మహారాజ్‌కీ జై అంటూ కదం తొక్కారు. దాదాపు ప్రతి కూడలిలో కొద్దిసేపు ఆగి ప్రత్యేకంగా నినాదాలు చేశారు.

కడపరాయుని కల్యాణ వైభోగం



కల్యాణమూర్తులుగా స్వామి, అమ్మవార్లు

కడప కల్చరల్ : దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శ్రవణానక్షత్రం సందర్భంగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు మచ్చా శేషాచార్యులు, కృష్ణమోహన్, త్రివిక్రమ్ బృందం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉభయదేవేరులతో సహా స్వామి ఉత్సవ మూర్తుల ను వధూవరులుగా అలంకరించి కల్యాణ పీఠంపై కొలువుదీర్చారు. కల్యాణ క్రతువును క్రమంగా నిర్వహించారు. అనంతరం స్వామి పక్షాన అమ్మవార్ల గళసీమల్లో అలంకరించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు కల్యాణ హారతులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం వధూవరులను పల్లకీపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తజనం

ఘనంగా గంగమ్మ తిరునాల



పులివెందుల: ప్రత్యేక అలంకరణలో గంగమ్మ చింతల అమ్మవారు

పులివెందుల రూరల్ : మండలంలోని తుమ్మలపల్లె సమీపంలో వెలసిన గంగమ్మ చింతలలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని మరుసటి రోజు గంగమ్మ చింతలలో సిరిబండికి భాను గొర్రెను కట్టి తుమ్మలపల్లె నుంచి ఊరేగింపుగా గంగమ్మ చింతలకు చేరుకుని అక్కడ అమ్మవారికి జంతుబలులు సమర్పించారు. గంగమ్మ చింతలకు పులివెందుల, తొండూరు మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అలాగే పట్టణంలోని కదిరి రోడ్డులో ఉన్న దిన్నెపాటి గంగమ్మతల్లి తిరునాల సందర్భంగా మంగళవారం బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు సుంకర వెంకటనారాయణ తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. ఒంగోలు గిత్తల చే బండ లాగుడు పోటీలు ఉంటాయన్నారు. మొదటి బహుతిరూ.80 వేలు, రెండవ బహుమతి రూ.60 వేలు, మూడవ బహుమతి రూ.40 వేలు, 4వ బహుమతి రూ.20 వేలు, 5వ బహుమతి రూ.10 వేలు ఉంటుందన్నారు. రాత్రి సమయంలో జ్యోతుల కార్యక్రమం ఉంటుందన్నారు.

ఓపన్ జిమ్ ఏర్పాటుకు చర్యలు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో నిరుపయోగంగా ఉన్న చిల్డ్రన్స్ పార్క్‌లో ఓపన్ జిమ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కడప నగరపాలక సంస్థ కమిషనర్ జి. సూర్యసాయిప్రవీణ్‌చంద్ ఆదేశించారు. ఆదివారం సాయంత్రం కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానాన్ని కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ ఇండోర్ ఆవరణలో అధునాతన జిమ్‌సెంటర్‌ను మరో వారం రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. స్కేటింగ్ రింక్‌లో చేయాల్సిన మార్పులను సూచించారు. అవుట్‌డోర్ మైదానంలో మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎన్.వి.పి. అమృత్‌రాజ్ పాల్గొన్నారు.

జిల్లా ఒలంపిక్ సంఘం నూతన కమిటీ ఏర్పాటు



ఏకగ్రీవం ఎన్నికైన జిల్లా ఒలంపిక్ సంఘం నూతన కమిటీ

కడప స్పోర్ట్స్: వైఎస్ఆర్ కడప జిల్లా ఒలంపిక్ సంఘం నూతన కమిటీ ఏర్పాటైంది. కడప నగరంలోని వైఎస్ఆర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా ఒలంపిక్ సంఘం సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా, ఏపీ ఒలంపిక్ సంఘం పరిశీలకులుగా విచ్చేసిన శ్రీధర్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు ఎన్.వి.పి. అమృత్‌రా ఎన్నికల నిర్వహణ తీరును పరిశీలించారు. న్యాయ పరిశీలకులుగా ఎస్. షామ్స్ తబ్రేజ్ వ్యవహరించారు. అనంతరం వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు ఒలంపిక్ సంఘం నూతన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జిల్లా అధ్యక్షుడిగా సమరనాథరెడ్డి

జిల్లా ఒలంపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడుగా కె.ఎన్. సమరనాథరెడ్డి(స్క్వాష్) ప్రధాన కార్యదర్శిగా సునీల్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు చైర్మన్‌గా టి. సుధీర్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సుధాకర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా నాయబ్ రసూల్, టి. జనార్ధన్, కోశాధికారిగాసాయికిశోర్, ఈసీ మెంబర్లుగా ప్రిన్స్ ఐజాక్, అశ్వర్థలను ఎన్నుకున్నారు.

రేపు కైలాసనాథేశ్వరాలయంలో కల్యాణం

నందలూరు(రాజంపేట): టంగుటూరులోని ప్రాచీన శివాలయం కైలాసనాథేశ్వరాలయంలో శివపార్వతుల కల్యాణం ఈనెల 21న ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. సాయంత్రం గ్రామోత్సవం ఉంటుందన్నారు. రాత్రికి సత్య హరిశ్చంద్ర నాటకం ప్రదర్శిస్తారన్నారు. 22న మధ్యాహ్నం బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు.

అయ్యవారురెడ్డిస్వామికి పూజలు

సిద్దవటం : మండలంలోని మూలపల్లె గ్రామంలో జీవ సమాధి అయిన అయ్యవారురెడ్డి స్వామికి ఆదివారం భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మహా శివరాత్రి నాడు శ్రీ నిత్యపూజ స్వామిని దర్శించుకున్న భక్తులు అదివారం అయ్యవారురెడ్డి స్వామిని దర్శించుకుంటారు. భక్తులు స్వామి వారి సమాధి చుట్టూ ప్రదక్షిణలు చేసి కాయాకర్పూరాలు అందించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు.